నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ గురువారం 31 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

## ఆశల ధర్నా

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎదులాపురం, అక్టోబర్ 30 : బీసీజీ సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఎంహెచ్‌వో ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు వారికి సంబంధం లేని సర్వేలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనాలు ఇవ్వకుండా సర్వేల పేరిట వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. పారితోషికం లేని సర్వేలను ఆశ కార్యకర్తలకు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకురాళ్లు కాంత, రాధ, పార్వతి, లక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

## సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 30 : సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రతి 150 గృహాలకు ఒక ఎమ్యునరేషన్ బ్లాకుగా పరిగణించాలని, దీనికి ఒక అధికారి బాధ్యుడిగా ఉంటారని, ప్రతి కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన సరైన సమయానికి చేరుకుని సర్వేను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, డీపీసీ శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్నారు.

సోన్ : తెలంగాణ భవన్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎదులాపురం : కేసీఆర్ ప్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్ : కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు

# విద్యుత్‌పై బీఆర్ఎస్ విజయం

## కరెంటు చార్జీల పెంపునకు చెక్

- సామాన్యులపై భారం పడకూడదనే ఈఆర్‌సీ ఎదుట వాదనలు
- విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన తిరస్కరణ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం
- పటాకులు కాల్చి.. స్వీట్లు పంచుకుని గులాబీ శ్రేణుల సంబురాలు
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ధూంధాం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

బైంసాలో స్వీట్లు తినిపించుకుంటూ..

*కరెంట్ చార్జీలను పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి బీఆర్ఎస్ చెక్ పెట్టింది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచలేదు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడవకుండానే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 18,500 కోట్ల భారాన్ని వేయాలని చూసిందన్నారు. సామాన్యులపై ఈ భారం పడకూడదనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్(ఈఆర్‌సీ) ఎదుట వాదనలు వినిపించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన నిలబడి 100 శాతం పోరాడింది. బీఆర్ఎస్ వాదనలతో ఏకీభవించిన ఈఆర్‌సీ విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించింది. ఈ విజయంపై రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు బీఆర్ఎస్ ఆధ్వర్యం లో సంబురాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుచ్చారు. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంబురాల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో సంబురాలు జరిగాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బాంబులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. - మంచిర్యాల, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

## 15100 కాల్ చేయండి

- ఉచితంగా న్యాయ సహాయం పొందండి..
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
- టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్ల ఆవిష్కరణ

ఎదులాపురం, అక్టోబర్ 30 : అందరికీ న్యాయం జరిగేలా చూడడం జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ముఖ్య ఉద్దేశం అని, ఇందుకోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం డీఎల్ఎస్ఏ కార్యాలయంలో తెలంగాణ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 15100 ప్రచార పోస్టర్లను న్యాయమూర్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ఎలాంటి న్యాయ పరమైన సమస్యలు ఉన్నా, న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని వారికి ఇది చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి శివరాం ప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బోనగిరి సౌజన్య, న్యాయమూర్తులు దుర్గారాణి, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు

## పత్తి ధరల విషయంలో ఎమ్మెల్యేకు అవగాహన లేదు

- ఆయా రాష్ట్రాల్లో పత్తి రకాలను బట్టి ధరల నిర్ణయం ఉంటుంది..
- వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలి..
- దొంగలా రాత్రి వచ్చి ఒక్కడివే ధర నిర్ణయించావు..
- రైతులు నష్టపోతుంటే ఎంపీ, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ) : పత్తి ధరల విషయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఏ మాత్రం అవగాహన లేదని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను మంగళవారం సీసీఐ అధికారులను కలిసి కొనుగోళ్లలో రైతులు నష్టపోకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. గుజరాత్ , రాజస్థాన్, హర్యాన రాష్ట్రాల్లో పత్తి రైతులు సాగు చేసిన పంట వెరైటీలకు అనుగుణంగా ప్రైవేటు వ్యాపారులు ధరలను చెల్లిస్తారని తాను మాట్లాడానన్నారు. తన వ్యాఖ్యలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ వక్రీకరించారని.. ఆయన చేసిన వ్యాఖ్యలు బాధను, ఆవేదన కలిగించాయన్నారు. ఎమ్మెల్యే తెలివి తక్కువ మాటలు మానుకోవాలని సూచించారు. తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకు వదిలేస్తున్నట్లు తెలిపారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రైతులు పండించే పత్తి కంటే ఆదిలాబాద్ రైతులు సాగు చేసే పత్తి నాణ్యత కలిగి ఉంటుందన్నారు. పత్తి ధర ఎక్కువ కలిగించే విషయంలో బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు కలెక్టర్ సమక్షంలో వ్యాపారులు, రైతు సంఘాల నాయకులతో ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

### రైతుల కంటే పార్టీ సమావేశానికి ప్రాధాన్యం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన రోజు స్థానికంగా ఉండి రైతులకు మంచి ధర కల్పించేలా ప్రైవేటు వ్యాపారులను ఒప్పించాల్సిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతి సంవత్సరం పత్తి కొనుగోళ్ల ప్రారంభం రోజు మార్కెట్ యార్డుకు వచ్చి మంచి ధర ఇప్పించినట్లు పేర్కొన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఏ రోజు రైతులు ధర్నాలు చేయలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాత్రి వచ్చి ఒక్కరే వ్యాపారులతో చర్చించి ధర నిర్ణయించారన్నారు. ధర విషయంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కలెక్టర్‌తో కలిసి రైతుల సంఘాల నాయకులతో కలిసి ప్రైవేటు వ్యాపారులతో చర్చించి ధర నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో ఎయిర్‌పోర్టు, సిమెంటు పరిశ్రమ విషయంలో పాయల్ శంకర్ అబద్ధాలు ఆడారన్నారు.

### రేవంత్ రెడ్డితో చీకటి ఒప్పందం

గతంలో ఫసల్ బీమా విషయంలో ఆందోళనలు చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్, రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడడానికి భయపడుతున్నారన్నారు. దమ్ముంటే రైతు సమస్యలపై ధర్నా చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, రౌత్ మనోహర్, నర్సింగారావు, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, జగదీశ్, గండ్రత్ రమేశ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## ఆరు నుంచి ఇంటింటా సర్వే

### సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ

ఎదులాపురం, అక్టోబర్ 30 : నవంబర్ 6 నుంచి 18వ తేదీ వరకు ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించాలని సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం ఆదిలాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఇండ్ల జాబితా సేకరించి, ఇంటింటికీ స్టిక్కర్లు అతికిస్తారన్నారు. ఏ ఒక్క ఇండ్లు మిస్ అవ్వకుండా ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండల ప్రత్యేకాధికారి, ఇండస్ట్రీయల్ జనరల్ మేనేజర్ పద్మ భూషణ్‌రాజ్ పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి..

### - డీఆర్‌వో నజీర్‌ఖాన్

సారంగాపూర్, అక్టోబర్ 30 : అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న మారుమూల గ్రామాల్లోని గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో నజీర్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని మహారాష్ట్ర, బోథ్, సిరిపెల్లి, ఆదివాసీగూడ అటవీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి పెద్దపులి కోసం మానిటరింగ్ నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో పెద్దపులి అరుపులు వినపించాయని, దీంతో గిరిజనులు జాగ్రత్తగా ఉండి పెద్దపులి కనబడితే ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీఆర్‌వో రాజశేఖర్, ఎఫ్‌బీవోలు స్వప్న, సుజాత, స్రవంతి, ఫాజిల్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

జైనథ్, అక్టోబర్ 30 : ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండలంలోని దీపాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి మండలానికి ఒక రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ యూసాడ్ వారి సహకారంతో విద్య శాఖ సమన్వయంతో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం రవీందర్, కాంప్లెక్స్ హెచ్ఎం విజయసారథి, గ్రామ కార్యదర్శి మహేందర్, మాజీ సర్పంచ్ గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

### సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

– రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న ఎన్యుమరేటర్‌ల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి వెంకట్ రాజ్, తహసీల్దార్ శ్యాం సుందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో గ్రంథ పఠనం చేయిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## రైతు భరోసా ఇస్తే బాగుంటుండే..


కుమ్రం భీం విగ్రహావిష్కరణ సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి(భీంపూర్), అక్టోబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం దండారీ ఉత్సవాల్లో భాగంగా రూ.15 వేలు అందిస్తున్నదని, అలాగే రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా ఇస్తే బాగుంటుండే అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో ఎంపీ నగేశ్‌తో కలిసి ఎస్టీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి, కుమ్రం భీం విగ్రహావిష్కరణ చేశారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆదివాసులు గుస్సాడీ, దండోరా నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో భీంపూర్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసులకు ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కల్పించిన పోరాట యోధుడు కుమ్రం భీం అని ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. ఒకే వేదికపై అన్ని పార్టీల నాయకులు కనిపించారని ప్రజలు చర్చించుకున్నారు. ప్రగతిలో కూడా కలిసి నడవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, మాజీ ఎంపీపీ గడ్డం లస్మన్న, మాజీ సర్పంచ్ లింబాజీ, తుడుందెబ్బ తలమడుగు మండలాధ్యక్షుడు కుమ్ర జ్ఞానేశ్వర్, నాయకులు తిరుమల్ గౌడ్, రాకేశ్, మేకల నాగయ్య, గంధం రమణ, కృష్ణ, కుమం భీం కమిటీ సభ్యులు మడావి లింబాజీ, పురుషోత్తం, రవీందర్ జాదవ్, బలిరాం, ఉత్తం రాథోడ్, ధరం సింగ్, పాండురంగ్, జి.నరేందర్, నితీన్, అఫ్రోజ్, సంతోష్, కల్చప్ యాదవ్, గోవర్ధన్, జపూర్ అహ్మద్, జజ్జరి రాకేశ్ రెడ్డి, రమేశ్, నారాయణ రావ్, దేశ్‌ముఖ్, అశోక్, రఘు పాల్గొన్నారు.